సాక్షి
రంగారెడ్డి

సోమవారం । 28 । ఆగస్టు । 2023



నూతనోత్సాహం

చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజాగర్జన సభ సక్సెస్ కావడంతో క్యాడర్ నూతనోత్సాహంలో ఉంది. 8లో▸



మళ్లీ పనులు

మండలంలోని కొత్తపల్లి బొక్కల కంపెనీ నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



అభివృద్ధే మా ఎజెండా

అభివృద్ధే ఎజెండాగా సాగుతున్నామని, ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్‌లో ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతీ గేమ్‌లో ఒక్కో స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరు కావాలని, ఉదయం 9గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్, మైనార్టీ స్కూల్స్, కేజీబీవీ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు బోనోఫైడ్‌తో రావాలని సూచించారు.

గీత కార్మికులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

కడ్తాల్: గీత కార్మికులకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. తాటి చెట్టు పైనుంచి పడి ప్రమాదాలకు గురవుతున్న వారికి బాసటగా నిలిచేందుకు గీతన్న బీమా పథకానికి రూపకల్పన చేస్తోందని తెలిపారు. చరికొండ గ్రామంలో ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన అబ్బయ్యగౌడ్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. తక్షణ సాయంగా కార్పొరేషన్ నుంచి రూ.25 వేల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ నర్సింహగౌడ్, లింగంగౌడ్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శుల నియామకం

షాద్‌నగర్ రూరల్: పట్టణానికి చెందిన వినోద్, ప్రశాంత్, సయ్యద్ సోహెల్, మణికంఠరెడ్డి ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో యూనియన్ బలోపేతానికి తమ వంతు కృషిచేస్తామని నూతన ప్రతినిధులు తెలిపారు.

కేసీఆర్ హయాంలోనే తండాలకు గుర్తింపు



మంచిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కొత్తపల్లితండా గిరిజనులు

యాచారం: సీఎం కేసీఆర్ హయాంలోనే గిరిజన తండాలకు గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లితండాకు చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లోని తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. ఆయన చొరవతో మారుమూల తండాలకు సైతం బీటీ, సీసీ రోడ్లు వేశారన్నారు. దళిత, గిరిజనులకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు సుమతమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్ప బాష, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొంగళ్ల యాదగిరి, వార్డు సభ్యులు కాలె రమేశ్, నాయకులు పాలె శివ, రహీమ్, సోమరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

చేవెళ్ల: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు (సోమవారం) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో రాష్ట్ర మంత్రులు పి.సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిలు పాల్గొంటున్నట్లు మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, నరేందర్‌గౌడ్‌లు తెలిపారు. మండలంలోని రావులపల్లి, మల్లారెడ్డిగూడ, చేవెళ్ల, సింగప్పగూడ గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నట్లు తెలిపారు. ఉ. 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డిలు హాజరవుతున్నట్లు వారు తెలిపారు.



బోనంతో ఆలయానికి వస్తున్న యువతి



ఆమనగల్లులో బోనాల ఊరేగింపు



అమ్మవారి ప్రతిమ, బోనాల ఎదుట డప్పు కళాకారుల ప్రదర్శన

బోనం.. వైభవం

ఆమనగల్లు బోనమెత్తింది.. పట్టణంలో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీకృష్ణ యాదవ, గౌడ, వడ్డెర సంఘాల ఆధ్వర్యంలో కనుల పండువగా బోనాలు తీశారు. మహిళలు, యువతులు బోనాలతో తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, డప్పు కళాకారుల ఆటపాటలు, శివసత్తుల పూనకాలు చూపరులను అలరించాయి. బీజేపీ నేత ఆచారి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, నల్గొండ జిల్లా విజిలెన్స్ సీఐ గజ్జె చరమందరాజు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

– ఆమనగల్లు

'బడి'దొడుకులు!

- కనీస రక్షణ లేని భవనాల్లో ప్రైవేటు స్కూళ్లు
- ఒకవైపు నిర్మాణాలు.. మరోవైపు తరగతులు
- అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తున్న విద్యాశాఖ
- కన్పించని ఆటస్థలాలు ..
- ఆందోళనలో తల్లిదండ్రులు
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- షోకాజ్ నోటీసులతో సరి



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు 2,863 వరకు ఉన్నాయి. వీటిలో 1,319 ప్రైవేటు స్కూళ్లు, అనధికారికంగా మరో 45 వరకు ఉన్నట్లు అంచనా. ఈ ప్రైవేటు స్కూళ్లలో సుమారు 6.84 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మెజార్టీ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నిర్మాణ అనుమతులే కాదు అగ్నిమాపక వ్యవస్థ కూడా లేదు. సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, రాజేంద్రనగర్ మండలాల్లో ఈ తరహా భవనాలు ఎక్కువగా ఉన్నాయి. నిర్మాణ అనుమతులు లేని ఈ భవనాల్లో తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని యాజమాన్యాలు ఒకటి నుంచి ఏడు వరకు అనుమతి తీసుకుని.. పదో తరగతి వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నాయి. తీరా పరీక్షల సమయంలో వేరే ప్రాంతంలోని మరో స్కూలు పేరుతో హాల్ టికెట్లు జారీ చేస్తున్నాయి. పాఠశాలల్లో కనీస వసతులు కూడా ఉండటం లేదు. ఆటస్థలాలు మచ్చుకైనా కన్పించడం లేదు. ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలోనూ సైన్స్ ల్యాబ్ లేదంటే ఆశ్చర్య పోనవసరం లేదు. తాగునీరు కూడా విద్యార్థులే సమకూర్చుకోవాల్సి వస్తోంది. మరు గుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. పరోక్షంగా పిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

కింద నివాసాలు.. పైన తరగతులు

నిజానికి 'ఎస్టాబ్లిష్‌మెంట్, రికగ్నైజేషన్ అడ్మిషన్ అండ్ కంట్రోల్ ఆఫ్ స్కూలు అండర్ ప్రైవేటు మేనేజ్‌మెంట్ స్కూల్స్ యాక్ట్ 1993 ప్రకారం నివాస భవనాల్లో తరగతులు నిర్వహించ కూడదు. ఇలాంటి చోట తరగతుల నిర్వహణకు అనుమతి కూడా ఇవ్వకూడదు. జిల్లా విద్యాశాఖ ఇవేవీ పట్టించుకోకుండా అడ్డగోలుగా అనుమతులు జారీ చేస్తుండడం విశేషం. ఎవరైనా పిల్లల తల్లిదండ్రులు ఈ అంశంపై ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తాత్కాలికంగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు ఆశపడి.. అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పరిపాటిగా మారింది. వీటిలో కనీస పార్కింగ్ సదుపాయం కూడా ఉండటం లేదు. పిల్లలు తమ సైకిళ్లను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో కాలనీల్లో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. శారీరక, మానసిక వికాసం కోసం ఆటస్థలాలు కూడా లేవు. శరీరానికి కనీస వ్యాయామం కరువవుతోంది.

- హస్తినాపురం సౌత్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. కనీస పార్కింగ్ సదుపాయం కూడా లేదు. ప్రధానరోడ్డుపై ఉన్న ఈ భవనం కింద వ్యాపార, వాణిజ్య సంస్థలు కొనసాగుతున్నాయి. రెండు, మూడో అంతస్తులో నివాస గృహాలు ఉన్నాయి. ఓ పాఠశాల యాజమాన్యం ఇదే భవనంలో నివాసం ఉంటోంది. ఆపై అంతస్తుల్లో ఓ ప్రైవేటు స్కూలు నడుస్తోంది. కనీస రక్షణ లేని, ఆట స్థలం కూడా లేని ఈ భవనంలో ఒకటి నుంచి ఏడు వరకు తరగతుల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారనేదీ అంతు చిక్కడం లేదు.

- బాలాపూర్ మండలం టీచర్స్ కాలనీలోని వినాయకహిల్స్‌లో ఓ ప్రైవేట్ స్కూలు యాజమాన్యం ఏకంగా పిల్లలు ఆడుకునే ఆట స్థలంలో నాలుగంతుస్తుల భవనం నిర్మించి, ఫైర్ సేఫ్టీ వంటి కనీస నిబంధనలు చేపట్టకుండా 600 నుంచి 800 మంది పిల్లలకు తరగతులు నిర్వహిస్తోంది. ఈ అంశంపై జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదులు అందగా, ఇటీవల షోకాజు నోటీసులు జారీ చేశారు.

- హయత్‌నగర్ ఆర్టీసీకాలనీలో రెండంతస్తుల భవనంలో ఓ ప్రైవేటు స్కూలు కొనసాగుతోంది. మొదటి రెండు అంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు విద్యార్థులకు తరగతులు బోధిస్తూ మరో వైపు ఆపై అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారు. సదరు స్కూల్లో కనీస రక్షణ చర్యలు లేవు. స్కూలు నిర్వహణకు ఎలా అనుమతిచ్చారో అధికారులకే తెలియాలి.

- బీఎస్‌రెడ్డి సమీపంలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఓ నివాస భవనంలో ప్రైవేటు యాజమాన్యం డేకేర్ సెంటర్ నిర్వహిస్తోంది. ఒకటి నుంచి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు కూడా తీసుకోలేదు. దీనిపై విద్యాశా ఖకు ఫిర్యాదులు వెళ్లగా సరూర్‌నగర్ ఎంఈఓ ఇటీవల ఆ పాఠశాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఎమ్మెల్యేకు సహకరించం



సమావేశం అనంతరం అభివాదం చేస్తున్న నాయకులు

- తేల్చిచెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు
- జైపాల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా కడ్తాల్‌లో సమావేశం
- టికెట్ కేటాయింపుపై పునరాలోచించాలని అధిష్టానానికి వినతి

కడ్తాల్: బీఆర్‌ఎస్ కల్వకుర్తి టికెట్‌ను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఇస్తే ఎట్టి పరిస్థితిలోనూ సహకరించేది లేదని ఆ పార్టీ నాయకులు తేల్చిచెప్పారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఎల్‌ఆర్ గార్డెన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు మాట్లాడుతూ.. 'సిట్టింగ్‌లకే టికెట్లు' ప్రాతిపదికన ఎమ్మెల్యే పేరును ప్రకటించిన అధిష్టానం ఈ విషయంపై పునరాలోచించాలని కోరారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. కార్యకర్తలు, నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపర్చే పరిస్థితి లేదని తెలిపారు.

కసిరెడ్డికి అవకాశం ఇవ్వండి..

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిషలు కృషిచేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కసిరెడ్డికి అవకాశం ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. బీసీ నేతకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తే.. ఉద్యమ నాయకుడు, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ లేదా మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఇప్పటికే చాలా మంది నాయకులు గళం విప్పుతున్నారని, రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్రమవుతుందని తెలిపారు. గత శనివారం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాడ్గుల మండలంలో బాలాజీ సింగ్, ఆయన మద్దతుదారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారని గుర్తుచేశారు. జైపాల్ యాదవ్ వ్యతిరేక వర్గీయులు మున్ముందు తలకొండపల్లి, వెల్దండ, ఆమనగల్లు, కల్వకుర్తి మండలాల్లోనూ సమావేశాలు ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. పరిస్థితి మరింత ముదరక ముందే అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోవాలని అభ్యర్థించారు. 400 మందికి పైగా హాజరైన ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శేఖర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ డా.శ్రీనివాస్, నాయకులు జహంగీర్‌అలీ, లక్ష్మయ్య, భీష్మాచారి, శంకర్‌నాయక్, బలరాంనాయక్, గోపీనాయక్, శ్రీను, కేఎస్‌ఆర్ యువసేన నేత నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

స్థానికత అంశంపై ఏర్పడ్డ తెలంగాణలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

- ప్రొఫెసర్ కోదండరాం
- ఇందిరాపార్కు వద్ద జీఓ317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ మనోవేదన సభ

ముషీరాబాద్: హక్కులు అడ్డుక్కుంటే రావని, పోరాటాలతోనే సాధించుకోవాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జీఓ నెంబర్ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో నాన్ స్పౌజ్ బాధితులను సొంత జిల్లాలకు కేటాయించాలని, సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఉపాధ్యాయ, ఉద్యోగుల మనోవేదన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. జీఓ నెంబర్317 బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్పౌజ్, నాన్ స్పౌజ్ తేడా లేకుండా ఉద్యోగులు సంఘటితంగా హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం 5వేల పాఠశాలలను మూసివేసి నిరుపేద విద్యార్థులకు విద్యకు దూరం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రా ఉపాధ్యాయులు వెళ్లిపోయిన నేపథ్యంలో ఎవరి సొంత జిల్లాల్లో వారికి ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులపాత్ర కీలకమైందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు తలుచుకుంటే పాలకుల తలరాతలు మారుస్తారన్నారు. అయితే ఇటీవలి కాలంలో కొందరు ఉపాధ్యాయులు కూడా ఓటును అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, దత్తత్రి, వర్కింగ్ ప్రసిడెంట్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... 20 నెలలకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు 10 వేల మందికి పైగా స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరంగా ఉంటూ మానసిక క్షోభను అనుభవిస్తున్నారన్నారు. ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటివరకు 30 మంది ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రతిరోజు 200 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ ఆర్థికంగా, ఆరోగ్య పరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

మారథాన్.. అదిరెన్





ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ప్రారంభమైన ఫుల్, హాఫ్ మారథాన్, హైటెక్స్‌లో ప్రారంభమైన 10కె రన్‌లు గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ముగిశాయి. పీపుల్స్‌ప్లాజా వద్ద సీపీ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసి కమీషనర్ రోనాల్డ్ రాస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ వైద్యనాథ్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ నగరానికే తలమానికంగా నిలుస్తుందని సీపీ ఆనంద్ అన్నారు. పీపుల్స్ ప్లాజా నుంచి 1400 మంది, హాఫ్ మారథాన్‌లో 4 వేల మంది, 10కె రన్‌లో 8700 మంది పాల్గొన్నారు. ఫుల్ మారథాన్ పురుషుల విభాగంలో గోపి తోనకల్, తీర్థ కుమార్, స్టీఫెన్ కోస్గీ , మహిళ విభాగంలో తాంసింగ్, యామిని థాలెర్, డోర్కాస్ టారస్‌లో వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హాఫ్ మారథాన్‌లో పురుషుల విభాగంలో రమేష్ బొద్దిపల్లి, సుజిత్ కె, మనోజ్, మహిళ విభాగంలో ప్రీను యాదవ్, నవ్య వడ్లె, ఫహీమ్ ఫిర్దోస్‌లు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. 10కె రన్‌లో పరుషుల విభాగంలో వినీత్, రమేష్ చంద్ర రమావత్, అబ్దుల్ సలామ్, మహిళల విభాగంలో భాగ్యలక్ష్మీ దొంతు, గుంజ కుమారీ,తీయన భాస్కరస్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఫుల్ మారథాన్ విజేతలకు వరుసగా రూ 2.5 లక్షలు, రూ.2లక్షలు, రూ.1.5 లక్షల నగదు, హాఫ్ మారథాన్, 10 కె విజేతలకు నగదును ఎన్‌ఎండీసీ డైరెక్టర్ (టెక్నికల్) వినయ్‌కుమార్ అందజేశారు. 74 ఏళ్ల డాక్టర్ హరిహరన్ మారథాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇప్పటి వరకు ఆయన 250 మారథాన్‌లలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

– ఖైరతాబాద్/గచ్చిబౌలి



మారథాన్‌లో పాల్గొన్న యువత, ఔత్సాహికులు



ఎన్‌ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

అధిక వడ్డీకి ఆశపడి..

యాచారం: అధిక వడ్డీకి ఆశపడి ఓ మహిళ ఓ వ్యక్తికి రూ.లక్ష అప్పు ఇచ్చి మోసపోయింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగిన సమాధానం లేకపోవడంతో ఆదివారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లికి చెందిన తండ్రి కొడుకులైన చందు, సంతోషలు అధిక వడ్డీ ఆశ చూపి మాల్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ వద్ద కొద్ది నెలల కింద రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. నెలల గడిచినా వడ్డీ, అసలు ఇవ్వడం లేదు.. దీంతో పలు మార్లు భాగ్యమ్మ తన డబ్బులు ఇవ్వాలని చందు, సంతోషలను అడిగింది. వారి నుంచి స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన ఎస్‌ఐ గోపాల్ వెంటనే చందు, సంతోషలను పీఎస్‌కు పిలిపించి భాగ్యమ్మ వద్ద తీసుకున్న రూ. లక్ష నగదును ఇచ్చేయాలని హెచ్చరించాడు. లేని పక్షంలో కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. దీంతో త్వరలో రూ.లక్ష నగదు ఇస్తామని పోలీసులకు చెప్పారు.



ఎస్‌ఐ గోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న భాగ్యమ్మ



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మిక సంబరం

గానుగుమార్లతండాలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. గ్రామంలో భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పండుగ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, సర్పంచ్ హంశ్య మోత్యానాయక్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

– కడ్తాల్



బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

బొక్కల కంపెనీలో మళ్లీ పనులు ప్రారంభం

గ్రామస్తులు ఆందోళన

యాచారం: మండలంలోని కొత్తపల్లిలో ఉన్న బొక్కల కంపెనీలో శనివారం రాత్రి పనులు చేశారు. బొక్కల కంపెనీ వల్ల తీవ్ర దుర్వాసన వస్తుండడంతో కొన్ని నెలల కింద గ్రామస్తులు తీవ్ర ఆందోళనలు చేయడంతో అధికారులు కంపెనీని మూసేశారు. మళ్లీ శనివారం రాత్రి బొక్కల కంపెనీ నడిచినట్లు గ్రామస్తులు గుర్తించి ఆదివారం ఉదయం కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామ ఉప సర్పంచ్ కావలి జగన్, బీఆర్‌ఎస్ నాయకులు లోహిత్‌రెడ్డి తదితరులు కంపెనీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీఐ సైదయ్యకు ఫోను చేసి ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐ గోపాల్ కంపెనీ వద్దకు చేరుకుని కంపెనీ యజమానులతో మాట్లాడారు. అధికారులు మూసేసిన తర్వాత మళ్లీ పనులు చేయడం సరైంది కాదని ఎస్‌ఐ గోపాల్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు, కంపెనీ ప్రతినిధులు కూడా కంపెనీని మూసేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.



ఆందోళన చేస్తున్న జగన్, తదితరులు

గొంతు కోసి బాలుడి దారుణ హత్య



రాజాపాశ్వాన్(ఫైల్)

రాజేంద్రనగర్: ఓ బాలుడిని గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బండరాయిపై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా గొంతు కోసి హత్య చేసి ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, క్లూస్, డాగ్ స్క్వాడ్ బృందం ఆధారాలు సేకరించారు. ఇన్‌స్పెక్టర్ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సంజయ్ పాశ్వాన్ భార్య, కుమారుడు రాజా పాశ్వాన్(17)తో కలిసి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. కాటేదాన్ లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడి కుమారుడు రాజాపాశ్వాన్ ఇదే ప్రాంతంలోని స్క్రాబ్ దుకాణంలో పని చేసేవాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన రాజా పాశ్వాన్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. శనివారం కావడంతో షాప్‌కు వెళ్లి బత్తా తెచ్చుకుంటానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. దుకాణ యజమాని వద్దకు వెళ్లి ఆరా తీయగా డబ్బులు తీసుకుని వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఆదివారం ఉదయం హౌసింగ్ బోర్డు కాలనీలోని నిర్మాణుష్య ప్రాంతంలో బండరాయిపై యువకుడు పడి ఉన్నట్లు గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సంజయ్‌పాశ్వాన్ మృతుడు తన కుమారుడిగా గుర్తించాడు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. డాగ్ స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీమ్ సంఘటనా స్థలం వద్ద ఆధారాలుసేకరించాయి. రాజా పాశ్వాన్ రెండు రోజుల క్రితం స్థానిక యువకులతో గొడవ పడినట్లు తెలిసింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ మధు తెలిపారు. సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హస్తం శ్రేణుల్లో నూతనోత్సాహం

- చేవెళ్ల ప్రజాగర్జన సభ సక్సెస్‌తో జోష్
- ఆశావహుల్లో హుషారు

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ప్రజాగర్జన సభ కొత్త జోష్‌ను నింపింది. చేవెళ్లలో నిర్వహించిన సభ సక్సెస్ కావడంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో చేవెళ్లలో ప్రభంజనం సృష్టించేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అనుకున్నదానికంటే ఎక్కువ జనం రావడంతో పార్టీ నేతలు సైతం అధికారం తమదేనని భావిస్తున్నారు. గతకొన్ని ఏళ్లుగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. ప్రజాగర్జన సభతో చేవెళ్లలో పార్టీకి పూర్వ వైభవం రానుందనే చర్చ మొదలైంది. అయితే, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల టికెట్ ఎవరికిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఆశావహుల్లో హుషారు..

నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నవారిలో ప్రజాగర్జన సభ సక్సెస్ కావడం కొత్త ఉత్సాహన్ని నింపింది. చేవెళ్లలో గెలుపు ఖాయమనే ధీమా పార్టీ నాయకుల్లో వచ్చింది. టికెట్ ఆశిస్తున్న స్థానిక నాయకులు మొయినాబాద్‌కు చెందిన షాబాద్ దర్శన్, చేవెళ్లకు చెందిన సున్నపు వసంతం, షాబాద్‌కు చెందిన పామెన బీంభరత్‌లకు ప్రజాగర్జన సభలో మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో ఆ ముగ్గురు నేతల్లో హుషారు పెరిగింది. సభ విజయవంతం కావడంతో ముగ్గురు నేతలు ఎవరికి వారే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

స్థానికులకే టికెట్ దక్కేనా?

కాంగ్రెస్ పార్టీ టికెట్ స్థానిక నాయకులకే దక్కుతుందా.. వలస నాయకులు హస్తగతం చేసుకుంటారా? అనే చర్చ నియోజకవర్గంలో జోరుగా నడుస్తోంది. గత కొంతకాలంగా షాబాద్ దర్శన్, సున్నపు వసంతం, పామెన బీంభరత్‌లు స్థానికులకు టికెట్ ఇవ్వాలంటూ తమ వాణిని వినిపిస్తున్నారు. శంషాబాద్‌కు చెందిన రాచమల్ల సిద్దేశ్వర్ సైతం చేవెళ్ల టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. గత కొంత కాలంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి చంద్రశేఖర్ చేవెళ్ల నుంచి పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కాంగ్రెస్ అధిష్టానం చేవెళ్ల టికెట్‌పై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. టికెట్ ఆశిస్తున్న నాయకులకు మీ పని మీరు చేసుకోండి అంటూ అధిష్టానం సూచించినట్లు తెలుస్తుంది. ప్రజాగర్జన సభతో ఫుల్ జోష్‌లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల టికెట్ ఎవరికి ఇస్తుందో వేచిచూడాలి.

ప్రతి ఒక్కరికి ధన్యావాదాలు

ప్రజాగర్జన సభ విజయవంతం కావడంతో చేవెళ్ల నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యావాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వెంట ప్రజలు ఉన్నారని ఈ సభ ద్వారా నిరూపితమైందని చెప్పారు. ఈ సభకు వచ్చిన జనాన్ని చూసి బీఆర్‌ఎస్ పార్టీకి గుబులు మొదలైదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్‌పార్టీ నిలబెట్టుకుంటుందని చెప్పారు. బలహీన వర్గాలకు అండగా నిలబడే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ.6లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. రూ.2లక్షల రుణమాఫీ చేసామన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తే ప్రజలను రోడ్డు మీద పడేస్తారని ఆరోపించారు.



చేవెళ్ల ప్రజాగర్జన సభకు తరలిన జనం(ఫైల్)

PUBLIC NOTICE

The general public is hereby informed that my client Sri. Mohammed Basharath Ullah Ansari, S/o. Mohammed Ghafoor Ullah Ansari, R/o. Saidabad, Hyderabad, is intending to purchase below mentioned schedule of property from its owner, Sri. Talari Krishna, S/o. Talari Venkataiah, R/ o. H.No.4-70, Ambedkar Nagar Colony, Chevella Village and Mandal, R.R.District -501503, for a valuable sale consideration. My client has already paid substantial amount as part sale consideration, by entering into an agreement with Sri. Talari Krishna. My client intends to complete the sale transaction by paying the balance sale consideration within a short period. If anyone has any objections for the above said transaction or if there are any third-party claims over the schedule of property, they may contact me with relevant documents, within 5 days from the date of publication of this notice. Inspite of this notice if no objections/third-party claims are received, my client will proceed to complete the sale transaction, treating that there are no objections from anyone and there are no third-party claims over the schedule of property.

SCHEDULE OF PROPERTY

All that the land in Sy.Nos.209/U (Ac. 0-17 Gts.) and 210/U (Ac. 0-12 Gts.), total admeasuring Ac. 0-29 Gts., situated at Tolkatta Village, Moinabad Mandal, R.R. District, T.S., and bounded by **NORTH:** Land of K. Narsimulu, **SOUTH:** Vaagu, **EAST:** Land of K. Yadaiah and **WEST:** Tolkatta Village Road

Sd/- **A.SRIDHAR, Advocate.**
Union Bank of India Building, P.S.Complex, 1st Floor, Moinabad R.R.District-501 504.
Date: 27-08-2023 Place: Moinabad. Cell No. 8977793417.

స్కూటీని ఢీకొట్టిన బైక్..

పాల వ్యాపారి మృతి

మొయినాబాద్: స్కూటీపై బంధువుల ఇంటికి వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఓ పాల వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని ముర్తుజగూడ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాకారం గ్రామానికి చెందిన బద్దుల రాములు(45) పాల వ్యాపారి. శనివారం సాయంత్రం ముర్తుజగూడలో ఉన్న బంధువుల ఇంటికి స్కూటీపై బయలుదేరాడు. మొయినాబాద్ నుంచి ముర్తుజగూడకు మట్టి రోడ్డులో వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మహిపాల్ అనే యువకుడు బైక్‌పై అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో రాములకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి

నందిగామ: పరిశ్రమలోని రేకులకు మరమ్మతులు చేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని నర్సప్పగూడ శివారులోని మహాలక్ష్మి స్టీల్ పరిశ్రమలో హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాన్(40) మూడు రోజుల క్రితం రేకులకు మరమ్మతులు చేసేందుకు పనిలో చేరాడు. శనివారం పనులు చేస్తుండగా ప్రమాదవశత్తు కిందపడి తీవ్రగాయాల పాలైయ్యాడు. దీంతో పరిశ్రమ సిబ్బంది వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ.. ఆదివారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. కాగా, మృతుడి సోదరుడు సయ్యద్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అతివేగం తీసిన ప్రాణం

లారీ ఢీకొని వ్యక్తి మృతి



సాదిక్ హుస్సేన్ మృతదేహం

తాండూరు రూరల్: ఓ లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంతో ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని కరన్‌కోట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన సాదిక్ హుస్సేన్ (34)కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం ఆయన అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిలబడి ఉండగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. భార్య సలీమాబేగం ఫిర్యాదు మేరకు కేసు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని గృహిణి ఆత్మహత్య

జియాగూడ: భర్తతో గొడవపడి ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. ఎస్‌ఐ వేణుగోపాల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌కు చెందిన సనా ఫాతిమా(27) జియాగూడ సోనా హోటల్ ప్రాంతంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పని చేస్తున్న ఆమె తల్లి జయ వద్దనే నర్సుగా పని చేస్తోంది. ఆమె భర్త జాహేద్ స్కూటీ తీసుకెళ్లేందుకు శనివారం ఆసుపత్రికి వచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం జాహెద్ పహాడీషరీఫ్‌కు వెళ్లిపోయాడు. రాత్రి ఇంటికి వచ్చిన ఆమె భర్త జాహేద్ తలుపు కొట్టినా తెరవకపోవడంతో తలుపులు బలవంతంగా తెరిచి చూడగా సనా ఫాతిమా ఉరివేసుకుని కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరుకల కులస్తులు ఏకమవ్వాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు



మాట్లాడుతున్న నర్సింలు

దౌల్తాబాద్: ఎరుకల సంఘం సమస్యల పరిష్కారానికి కులస్తులంతా ఏకమై పోరాటం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాగారి నర్సింలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మండల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2003లో ఐకమత్యంతో పోరాటం చేస్తే అప్పటి ఎంపీ విఠల్‌రావు మహబూబ్‌నగర్‌లో ఏకలవ్య కాలనీ ఏర్పాటు చేశారన్నారు. పదేళ్ళుగా ప్రభుత్వం ఎరుకలకు ఏ పథకాలు అందించడం లేదన్నారు. కార్యక్రమంలో మద్దూరు, దౌల్తాబాద్ మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కిష్టప్ప, బాల్‌రాజు, వెంకటయ్య, బాలయ్య, దేవప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే మా ఎజెండా



అల్మాస్‌గూడలో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సబితారెడ్డి

- మంత్రి సబితారెడ్డి
- రూ.12.38 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: అభివృద్ధే మా అజెండాగా ముందుకు సాగుతున్నామని ఇది ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో రూ.12.38 కోట్ల నిధులతో (జనరల్ ఫండ్, హెచ్‌ఎండీఏ) 1,2,3,4,5,22,24,26,30 డివిజన్లలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను ముఖ్యఅతిథిగా సబితారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఇందులో మంచినీటి పైప్‌లైన్, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీహాళ్లు, ఇతర మౌలిక వసతులున్నాయి. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే సీఎం కేసీఆర్ మహేశ్వరం అభివృద్ధికి రూ.150 కోట్లు మంజూరు చేశాడని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రోత్సహం అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళ్లల అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామన్నారు. వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే ఓర్చుకోలేని ప్రతిపక్షాలు బురదజల్లె ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఎన్ని ట్రిక్కులు ప్లే చేసిన ప్రజలు నమ్మెస్థితిలో లేరన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతుందని ప్రజలు బలంగా విశ్వశిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హాట్రిక్ సాధించబోతున్నారని మహేశ్వరం గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసేలా ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రంశేఖర్, కార్పొరేటర్లు కవిత, స్వప్న, రాంరెడ్డి, దీపిక, లలిత, మమత, పి.శ్రీనివాస్‌రెడ్డి, స్వప్న, పద్మ, ఆర్.మాధురి, కమిషనర్ సుమన్‌రావు, ఫ్లోర్ లీడర్ అర్జున్, నాయకులు ఆనంద్‌రెడ్డి, బి.జంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణ, బీఆర్‌ఎస్ కార్పోరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, కృష్టారెడ్డి, తదితరులున్నారు.

యువకుడికి నివాళి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడకు చెందిన యువకుడు కేసరి మహేష్‌రెడ్డి శనివారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సబితారెడ్డి పార్థివదేహానికి ఆదివారం నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కార్పొరేటర్‌రోహిణి రమేష్, మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుర్మల్‌గూడ వాసులు ఉన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

షాబాద్: మండలంలోని మల్లారెడ్డిగూడ, సంకెపల్లి గూడ, గోపిగడ్డ గ్రామాల్లో ఆదివారం మహిళలు పెద్ద ఎత్తున మల్లన్న బోనాలు నిర్వహించారు. డోలు, డప్పుల, భాజాభజంత్రీలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులో వెలసిన మల్లన్న ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ముద్దెంగూడ ఎంపీటీసీ చెన్నయ్య, మల్లారెడ్డిగూడ, సంకెపల్లిగూడ గ్రామాల సర్పంచ్‌లు జంగయ్య, దర్శన్, గ్రామస్తులు గణేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, గోపాల్, వెంకటయ్య, రాపోల్ నర్సింలు, రాజు, ప్రవీణ్, రఘువరెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.



మల్లారెడ్డిగూడలో పోతురాజుల విన్యాసాలు



సంకెపల్లిగూడలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు